

బచ్చికుంట చెరువు బాగుపడింది..

నాడు దుర్గంధం.. నేడు ఆహ్లాదం

- అభివృద్ధి చేసిన బైరెడ్డి ఫౌండేషన్
- వర్షపు నీటితో కళకళలాడుతున్న చెరువు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని బచ్చికుంట చెరువు మంచినీటితో కళకళలాడుతోంది. బైరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువును బాగుచేశారు. అలాగే పార్కును అభివృద్ధి చేశారు. గతంలో మురుగునీటితో నిండిన బచ్చికుంట చెరువు నేడు వర్షపు నీటితో స్వచ్ఛంగా తయారవడంతో చుట్టుపక్కల కాలనీలవాసులు పిల్లలతో సహా పార్కుకు వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. పరిసర ప్రాంతవాసులకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వచ్చింది. గతంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి చెరువు అభివృద్ధికి బైరెడ్డి ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీంతో చెరువు సుందరీకరణకు నోచుకుంది. కాగా నగరంలో చెరువులు, కుంటల సుందరీకరణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో కొన్ని చెరువులు అభివృద్ధికి నోచుకున్నాయి. మరికొన్నింటి పనులు నత్తనడకన జరుగుతున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న భవనాలు, జనాభా దృష్ట్యా మౌలిక వసతుల కల్పన అనివార్యం కావడంతో డ్రైనేజీ పైప్‌లైన్‌ను దగ్గరలో ఉన్న చెరువుల్లో కలిపేశారు. దీంతో చెరువులన్నీ మురికికూపాలుగా మారాయి. దీనికితోడు దోమలు విజృంభించడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ వారు చెరువును అభివృద్ధి చేశారు.

- చందానగర్ డివిజన్ పరిధిలోని బచ్చికుంట చెరువు విస్తీర్ణం 3.20 ఎకరాలు
- బైరెడ్డి ఫౌండేషన్ వారు చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ వేసి, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, కట్టపై మొక్కలు నాటారు.
- చిన్నారులు ఆడుకోవడానికి, వృద్ధులు సేదతీరడానికి సౌకర్యాలు కల్పించారు
- కేవలం సంవత్సరంలో బచ్చికుంట చెరువును ఆహ్లాదకరంగా మార్చారు.
- చెరువు బాగుపడడంతో చుట్టుపక్కల ఉన్న రాజేందర్‌రెడ్డి కాలనీ, సురక్ష కాలనీ తదితర కాలనీలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు
- ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు బైరెడ్డి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.





పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

ఎంజాయ్ చేస్తున్నాం..



బచ్చికుంట చెరువు బాగుపడింది. మా పిల్లలతో ఇక్కడకు వస్తున్నాం. గతంలో చెరువు వైపు చూడాలంటే భయపడే వాళ్లం. ఇప్పుడు ఆహ్లాదకరంగా మారింది. దీంతో కాలనీవాసులు ఇక్కడకు వస్తున్నారు.

– వెంకట్‌రెడ్డి, స్థానికుడు

వాకింగ్‌కు వస్తున్నాం..



గతంలో చెరువు వద్దకు రావాలంటే దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడ్డాం. బైరెడ్డి ఫౌండేషన్ చేసిన అభివృద్ధితో ఇక్కడకు వచ్చి వాకింగ్ చేస్తున్నాం. మరింత అభివృద్ధి చేయాలి.

– నరేందర్, స్థానికుడు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, జయభేరీ ఎన్‌క్లేవ్, ఓల్డ్ గచ్చిబౌలి, హిల్‌రిడ్జ్ విల్లాస్, హిల్‌రిడ్జ్ స్ప్రింగ్స్, టిమ్స్ హాస్పిటల్, గోపీచంద్ అకాడమీ, జీపీఆర్ఏ క్వార్టర్స్, యూకో బ్యాంక్ లేన్, గ్రీన్‌ల్యాండ్ కాలనీ, జేవీ కాలనీ, ట్రిపుల్ ఐటీ, జీఎన్ఐడీబీ, గచ్చిబౌలి స్టేడియం, హాకీ స్టేడియం, బ్రహ్మకుమారీస్, కేంద్రీయ విహార్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీజీఐఐసీ, వైఎస్సార్ భవన్, జర్నలిస్ట్ కాలనీ, గౌలిదొడ్డి విలేజ్, ఫైర్‌స్టేషన్, అపర్ణ షంగ్రిల్లా, కేశవ్ నగర్, జయభేరీ ఫేజ్–4, జయభేరీ మిడోస్, జయభేరీ ఆరంజ్ కౌంటీ, ఐఐఆర్ఎం, డీడీఎల్, సీఏ, బ్రిగేడ్, మంత్రి కామన్ సర్వీస్, వెస్టెండ్ క్యాపిటల్, ఐసీఐఎల్, అలీఫ్, ఐఆర్‌డీఏ, కార్వీ, లెమన్ ట్రీ హోటల్, మై హోం క్రిష్, రాయల్ అర్చిడ్, టీఎన్‌జీఓస్ కాలనీ,ఓల్డ్ గచ్చిబౌలి, కేంబ్రిడ్జి స్కూల్, ఎన్ వీడియా, ట్రెండ్‌సెట్, రాజపుష్ప, పుకట్ కాలనీ, నానక్‌రాంగూడ విలేజ్, పద్మశ్రీ గార్డెన్, ఐఎల్ఎస్ పార్క్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

- కొండాపూర్‌లో.. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిల్పాపార్క్‌లో విద్యుత్ సరఫరా ఉండదని కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఇక్రిశాట్ ఫీడర్ పరిధిలో.. దీప్తిశ్రీనగర్ రోడ్డు నంబర్ 14, డీపీఎస్ స్కూల్, ఆర్వీ నిర్మాణ్, గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్, అయ్యప్పస్వామి టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

శిల్పారామంలో గాంధీ శిల్పబజార్ ప్రారంభం



మేళాను ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌రావు



కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో బుధవారం గాంధీ శిల్పబజార్ మేళా ప్రారంభమైంది. రీజినల్ డైరెక్టర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్ లక్ష్మణ్‌రావు, అడిషనల్ డైరెక్టర్ అపర్ణ, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు, జనరల్ మేనేజర్ నర్సింహులు ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళా ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటయ్యాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్మల విశ్వేశ్వర్‌రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. గీతం, పుష్పాంజలి, భజమానస, చక్కని తల్లికి, రామగీతం, తాండవ నృత్యకారి, తరంగం, మంగళం, తదితర అంశాలను ప్రదర్శించారు. ఫొటో పెయింటింగ్, బస్తర్ ఐరన్ క్రాఫ్ట్, జరిజర్దోసి, జువెలరీ, హ్యాండ్‌ప్రింటెడ్, డ్రెస్ మెటీరియల్, చీరలు, టెర్రకోట, లేస్ వర్క్, బిద్రి క్రాఫ్ట్, వెదురు బుట్టలు, సిల్వర్ ఫిలిగ్రి , చెక్కబొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 50, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 50(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 350.

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



రాయదుర్గం: ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ పరీక్షలో గచ్చిబౌలి హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో నిర్వహించిన ఈ పోటీలలో హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మోక్షరూప, లైనాసింగ్ టాప్–50 ర్యాంకులో నిలిచారు. మోక్షరూప 45వ ర్యాంకు, లైనాసింగ్ 46వ ర్యాంకును సాధించారు. కాగా బుధవారం క్యాంపస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ పి మురళి విద్యార్థులు, గణిత ఉపాధ్యాయులను అభినందించారు.

నేడు హెచ్‌సీయూలో సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్వర్ణోత్సవాలు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'బలమైన, స్థిరమైన భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై బిట్స్ పిలానీ క్యాంపస్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు ఉపన్యాసం ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూలోని ఈస్ట్ క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు.

డ్రంకెన్ డ్రైవ్.. 9 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఐదుగురికి రూ. 2 వేలు జరిమాన, అదేవిధంగా మరో ముగ్గురికి రూ. 1500 జరిమాన, మరో వ్యక్తికి రూ.1500 జరిమానాతో పాటు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్యనగర్ కాలనీ కమిటీ కార్యాలయంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సరం కేలండర్‌ను బుధవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, రాందాస్‌గౌడ్, నరసింహులు, సత్యంరావు, మహేందర్‌రావు, నాగేశ్వరరావు, జీవన్‌రెడ్డి, వెంకటస్వామిగౌడ్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ డిగ్రీల కంటే నైపుణ్యానికి ప్రాధాన్యం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ ఎల్లా

రాయదుర్గం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో అకడమిక్ డిగ్రీల కంటే నైపుణ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని భారత్ బయోటెక్ చైర్మన్, పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఉన్నత్ భారత్ అభియాన్, హెచ్‌సీయూ సంయుక్త ఆధ్వర్యంలో 'స్కిల్ ఇండియా ఫర్ వీక్షిత్ భారత్: గ్రామీణ యువతకు భవిష్యత్తు అవకాశాలను కల్పించడం' అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో సంపాదించిన నైపుణ్యాలను గ్రామీణ ప్రాంతాలలో ప్రభావవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియా ఎంటర్‌ప్రైజెస్ ఏఈఈ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్‌శర్మ, ఉన్నత్‌భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ రావుల కృష్ణయ్య, హెచ్‌సీయూ ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ, ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ సంధ్యాగోప కుమరన్, అగ్రిగ్రి బయోటెక్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ జి పక్కీరెడ్డి, ఇన్వెస్టర్, స్టార్టప్ మెంటర్, ఇన్నోవేషన్ అండ్ డిజిటల్ లీడర్ రేణుక, డాక్టర్ ఎస్ వెంకట్‌రెడ్డి, ఏ కరుణ్‌రెడ్డి, డాక్టర్ సామా ఎల్లారెడ్డి ప్రసంగించారు.

అరుదైన శస్త్రచికిత్స



మాదాపూర్: మాదాపూర్ మెడికవర్ ఆసుపత్రి డాక్టర్లు అరుదైన శస్త్ర చికిత్స చేసి సోమాలియా బాలుడి ప్రాణాలు కాపాడారు. బుధవారం శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ మధుమోహన్‌రెడ్డి తెలిపారు. సోమాలియాకు చెందిన 13 సంవత్సరాల బాలుడికి అన్నవాహిక కుచించుకుపోవడంతో వయసుకు తగ్గట్టుగా 50 కేజీల బరువు ఉండాల్సి ఉండగా 19 కేజీలు మాత్రమే ఉన్నాడు. లాలాజలంను కూడా మింగలేక పోతున్నాడు. దీంతో మెడికవర్ మల్టీ డిసిప్లినరీ బృందం రెట్రోస్టెర్నల్ ద్వారా పెద్దప్రేగు మార్పిడి, గొంతు వద్ద అన్నవాహికను సరిచేయడంతో పాటు పొట్ట లోపల డిస్టల్ కోలో గ్యాస్ట్రిక్ అనస్టోమోసిస్ చేసి బాలుడిని కాపాడారు. డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఐఓబీసీఎస్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సాయికిరణ్



పీహెచ్‌డీ విద్యార్థి సాయికిరణ్



పీహెచ్‌డీ విద్యార్థి లక్ష్మీ నరసయ్య



పీహెచ్‌డీ విద్యార్థి వసుమతియాదవ్

రాయదుర్గం: అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్ఏ) జాతీయ, రాష్ట్ర కమిటీల్లో హెచ్‌సీయూ విద్యార్థులకు సముచిత స్థానం లభించింది. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్ కుమార్ బుధవారం హెచ్‌సీయూ వద్ద మాట్లాడారు. హెచ్‌సీయూలోని రాజకీయశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ విద్యార్థి సాయికిరణ్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తెలుగువిభాగంలో పీహెచ్‌డీ విద్యార్థి లక్ష్మీ నరసయ్య (లక్కీ) జాతీయ కార్యదర్శిగా, తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించారు. డ్యాన్స్ విభాగంలో పీహెచ్‌డీ విద్యార్థి వరకాల వసుమతి యాదవ్ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఓబీసీల హక్కుల సాధన కోసం ఏఐఓబీసీఎస్ఏ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పనే లక్ష్యం



సదస్సులో పాల్గొన్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

మాదాపూర్: పేదరిక నిర్మూలన ,ఉద్యోగ కల్పనే లక్ష్యంగా హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా ముందుకు సాగుతుందని హ్యాండ్ ఇండియా మేనేజింగ్ ట్రస్టీ కిషన్ తెలిపారు. బుధవారం మాదాపూర్ లెమన్ ట్రీ హోటల్‌లో ఒక్కరోజు సదస్సు నిర్వహించారు. హైటెక్ సిటీలో చేపట్టాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలు, వాలంటరీ వ్యవస్థ ప్రాముఖ్యత అనే అంశాలపై కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా టీ హబ్ మాజీ సీఈఓ సామాజిక సేవా కార్యక్రమాలపై కీలక ఉపన్యాసం చేశారు. బిలియన్ హార్ట్స్ బీటింగ్ ఫౌండేషన్ హెడ్ అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ హెడ్ జేసుదా జిజారియా మాట్లాడుతూ రూరల్ ప్రాంతాలలో హెల్త్‌క్యాంపులు , బిలియన్ హార్ట్ టు బీట్ అనే ప్రత్యేక కార్యక్రమం , సిపిఆర్‌పై పోలీసు, ఇతర సిబ్బందికి ఉచిత శిక్షణ వంటి కార్యక్రమాలను చేపడుతూనే తిరుపతి, అయోధ్యలో ఉచిత ఎమర్జెన్సీ ట్రామా కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హెచ్ఐహెచ్ అడ్వైజర్ సందీప్ ముఖర్జీ మాట్లాడుతూ మూడు లక్షల మంది బాండెడ్ లేబర్‌కి విముక్తి కలిగించి విద్యవైపు తీసుకువచ్చామన్నారు. ఈ సదస్సులో హెచ్ ఐ హెచ్ చీఫ్ మేనేజర్ జాన్‌క్రిస్టోఫర్, సోషల్ మెంటార్ పార్టనర్ ఆమ్రపాలి శర్మలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

మాదాపూర్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మాదాపూర్ గుట్టల బేగంపేట్‌లో నివాసముండే నిమ్మ వంశీకృష్ణారెడ్డి (25) బీటెక్ చేశాడు. ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు.ఈ క్రమంలో ఈనెల 7వ తేదీ ఉదయం 8.15 నిమిషాలకు క్యాబ్ తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్ళాడు. బుధవారం ఉదయం 9.30 గంటలకు అరుణోదయ కాలనీలోని శ్రీ నిర్వాణ ఇన్ హోటల్‌లో సూసైడ్ చేసుకున్నాడు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్టు తేలిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



పటాన్‌చెరు టౌన్: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో ఆటోడ్రైవర్లకు బుధవారం రోడ్డు భద్రత నిబంధనలు, జాగ్రత్తల పై ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ముఖ్యంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలుపవద్దన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని సూచించారు.

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మాదాపూర్: వరద నీటి సమస్య శాశ్వత పరిష్కార దిశగా పనులు చేపట్టడం జరుగుతుందని పీఏసీ చైర్మన్ గాంధీ తెలిపారు. బుధవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని గఫూర్‌నగర్ కాలనీ జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు , సైబర్‌హిల్స్ నుంచి వయా జనార్దన్‌హిల్స్ యూరో కిడ్స్ స్కూల్ వరకు 25 కోట్ల 41 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే నాలాల విస్తరణ, ఆర్‌సీసీ బాక్సు నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని ఎమ్మెల్యే గాంధీ, ఎస్ఎన్‌డీపీ విభాగం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్‌హిల్స్ నుంచి యూరో కిడ్స్ వరకు రూ. 13.86 కోట్ల రూపాయలతో నాలా విస్తరణ పనులు, గఫూర్‌నగర్ కాలనీ జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు 11.55 కోట్ల రూపాయలతో ఆర్‌సీసీ బాక్సు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డిపి అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ వశీధర్, ఏఈ వెంకటేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో రూ.3 కోట్ల అంచనాతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం శంకుస్థాపన చేస్తారు. అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియలో భాగంగా గచ్చిబౌలి, కొండాపూర్ డివిజన్లలో రూ.93 లక్షల వ్యయంతో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. చందానగర్, మియాపూర్ డివిజన్లలో రూ.2.07 కోట్ల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు సాయంత్రం 4 గంటలకు శంకుస్థాపన చేస్తారు. కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, షేక్ హమీద్ పటేల్, మంజులా రఘునాథ్‌రెడ్డి, శ్రీకాంత్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొంటారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



నానక్‌రాంగూడలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.రాబోయే కాలంలో కాలనీవాసులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ ఏఈ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, నాయకులు శివసింగ్, తిరుపతి, కిషన్, సుమన్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం
- జనవరి 20లోపు నూతన రిజర్వాయర్ల ద్వారా నీటి పంపిణీ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్, బొల్లారం మున్సిపల్ పరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్ల ద్వారా మంచినీటి సరఫరా ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. జలమండలి అధికారులు, మున్సిపల్ చైర్మన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఓఆర్ఆర్ పరిధిలో గల మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన రిజర్వాయర్లు, పైప్‌లైన్‌లు వేస్తారని తెలిపారు. ప్రధానంగా బొల్లారం మున్సిపల్ పరిధిలో రెండు మిలియన్ లీటర్ల సామర్థ్యం గల రెండు రిజర్వాయర్లు, పంప్ హౌస్ పనులు పూర్తయ్యాయని, త్వరలో మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ, లాలాబావి కాలనీ, బందంకొమ్ములలో మూడు రిజర్వాయర్లు పూర్తయ్యాయని.. 20వ తేదీ లోపు మంచినీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు. అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు మున్సిపాలిటీల నుండి ఐదు కోట్ల నలభై లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో కొల్లూరు, ఉస్మాన్‌నగర్‌లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఇప్పటికే 15,000 మంది లబ్ధిదారులు నివసిస్తున్నారని, ఇందుకు అనుగుణంగా సమస్యలు లేకుండా మంచినీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. నూతన రిజర్వాయర్ల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవిలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్ట్స్ శ్రీధర్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, జలమండలి జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, డీజీఎంలు చంద్రశేఖర్, శివ, సోమిరెడ్డి, బాల్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, కౌన్సిలర్లు మహదేవరెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.